తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కాణిపాకం దేవస్థానంలో ఇఓ ఆకస్మిక తనిఖీలు



కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఇఓ పెంచల కిషోర్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేవస్థానం నిత్యఅన్నదాన భవన్, లడ్డుపోటు, పడితరం స్టోర్, నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవన్, సామూహిక మరుగుదొడ్లు తదితర ప్రాంతాలను ఇఓ ఆకస్మితకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నదాన భవన్‌లో భక్తులకు అందుతున్న ఆహార పదర్థాల నాణ్యతను పరిశీలించారు. అలాగే పడితరం స్టోర్‌లో సరుకుల నాణ్యతను సైతం ఇఓ పరిశీలించారు. అనంతరం నూతన అన్నదాన భవన్‌లో ఇప్పటి వరకు జరిగిన పనులను ఆయన పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. దేవస్థానం ఇఇ వెంకటనారాయణ, ఎఇఒలు రవీంద్రబాబు, ధనంజయ, హరిమాధవరెడ్డి, ప్రసాద్, సూపరిటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణయోగ ఆశ్రమంలో కంచి కామకోటి పీఠాధిపతి

రామచంద్రాపురం, జూన్ 24 ప్రభాతవార్త



మండలంలోని ప్రాణయోగ ఆశ్రమా న్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయంద్ర సరస్వతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాస గురూజీ శిష్య బృందం స్వామీజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాస గురూజీ మాట్లాడుతూ స్వామి వారు ఐదు రోజులు ఆశ్రమంలో అందుబాటులో ఉంటారని, పరిసర ప్రాంతాలలోని భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందవచ్చునని తెలిపారు

## వరుణదేవా.. కరుణించవా..?

### - నైరుతిలో పలకరించని వర్షాలు.. వేరుసెనగ సాగుకు రైతుల ఎదురుచూపు !!



చుక్కనీరు లేని చెరువు

కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు వరుణదేవుడి కరుణ కటాక్షాల కోసం వేచి చేస్తున్నారు. ఈఏడాది నైరుతి రుతుపవనాలు కొంత ముందుగానే వచ్చినా వాటి ప్రభావం ఏమాత్రం చూపడం లేదు. జూన్ మాసం మరో వారంలో ముగుస్తున్నా ఇప్పటివరకు పడమటి ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. దీంతో పడమటి మండలాల రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వర్షాధారిత పంట అయిన వేరుసెనగ సాగుకై వర్షాలు కురవాలని ఎదురుచూపులు చూస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల దృష్ట్యా గత మే మాసంలో ఓ పక్క భానుడు భగభగలాడుతున్నా మరో పక్క మోస్తరు వర్షాలు కురిసాయి. దీంతో ఈసారి వర్షాకాలం మొదలైతే జూన్ నెలనుంచే మంచి వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు భంగపాటు తప్ప లేదు. గత ఏడాది సైతం పడమటి మండలాల్లో పలుచోట్ల వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ప్రభుత్వం ఆ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. కరువు మండలాల్లో కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు సైతం ఉన్నాయి. గతేడాది వర్షాభావంతో చాలాచోట్ల రైతులు వేరుసెనగ పంటపై ఆసక్తి చూపలేదు. రైతులు సాగు చేసిన పంట సైతం చేతికి అందకుండా పోయింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రైతులకు రాయితీతో కూడిన వేరుసెనగ విత్తనాలను సకాలంలోనే పంపిణీ చేసింది. దీంతో రైతులు పంట సాగుకు దుక్కులు దున్ని వర్షాలు పడితే విత్తేందుకు ఎదురుచూస్తున్నారు. వేరుసెనగ పంట సాగుకు జూలై ద్వితీయార్థం దాకా గడువు ఉందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. అంతలోపైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే రైతులు వేరుసెనగ సాగు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. మరి వరుణదేవుడు కరుణిస్తాడో లేదో వేచి చూడాల్సి ఉంది.

## అల్పాహారంలో కల్తీ .. విద్యార్థులకు అస్వస్థత

### పరుగులు తీసిన అధికారులు: తల్లిదండ్రుల ఆందోళన







ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు, పులిసిన పిండితో తయారుచేసిన ఇడ్లి, ఆసుపత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న ఆర్‌డిఓ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని సాంఘీక సంక్షేమ హాస్టళ్ళను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చొరవ చూపారు. రూపు రేఖలు మార్చేసారు. తరచూ పర్యవేక్షిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించారు. ఆయన మాతృమూర్తికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఆమె తరచూ హాస్టళ్ళను తనిఖి చేస్తున్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని పానగల్‌లో బిసి హాస్టల్‌లోని విద్యార్థులు 16 మంది అస్వస్థతకు గురయ్యారు. వారికి హాస్టల్‌లో ప్రాథమిక చికిత్స అందించినా ప్రయోజనం లేకఁపోవటంతో వారిని శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో జిల్లా అధికారులు పరుగులు తీసారు. వార్డెన్‌కు ముచ్చెమటలు పట్టాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. జిల్లా బిసి అధికారులు పరుగున వచ్చారు. వార్డెన్‌ను విచారణ జరిపారు. పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి పరుగులు తీసారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించారు. జిల్లా అధికారులు, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ ఆసుపత్రికి చేరుకున్నారు. డాక్టర్లతో చర్చించారు. ప్రతి అర్థగంటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై అధికారులతో సమాచారం అందుకున్నారు. ఏ ఒక్కరికి ఇబ్బంది కల్గకుండా ప్రత్యేక వైద్యసదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

**పులిసిన పిండితోనే ఇలా జరిగిందా?**

శ్రీకాళహస్తి బిసి హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురి కావటానికి పులిసిన పిండితో ఇడ్లి తయారు చేయటం వల్లనే ఇలా జరిగిందా? అని అధికారులు పరిశీలిస్తున్నారు. హాస్టల్‌లో ప్రతి శని, మంగళవారాల్లో విద్యార్థులు, సిబ్బంది, వార్డెన్‌లు ఇక్కడ తయారు చేసిన అల్పాహారాన్నే తీసుకుంటారు. అలాగే మంగళవారం కూడా అలాగే తయారు చేసారు. అయితే తయారు చేసిన ఇడ్లిలు పుల్లగా ఉన్నాయంటూ విద్యార్థులు చెబుతున్నారు. అల్పాహారం తీసుకున్న వెంటనే కొందరికి కడుపు నొప్పి, మరి కొందరికి వాంతులు మొదలయ్యాయని వివరించారు. ఇలా ఎందుకు జరిగిందనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే అల్పాహారాన్ని 60మంది తీసుకున్నారు. కానీ 16 మందికే ఇబ్బంది కల్గించిందని చెబుతున్నారు.

**ఆసుపత్రి పాలైన విద్యార్థులు వీరే:**

మంగళవారం సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో చేరిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. విష్ణు(14)మహేంద్ర, (14)భరత(12), చరణ్, (14), దేవేంద్ర (14), ప్రేమకుమార్(14), హిమల్ కుమార్ (14), చరణ్(14), జస్వంత్(13), రాజేష్, (14)రోహిత్ (13), రేవంత్(14), రాజాహులి(14), నవదీప్, (14) యశ్వంత్(14) ప్రేమ్‌కుమార్ (14)లు ఉన్నారు. ఉదయం నుంచి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు చికిత్స జరిపి సాయంత్రం అందరూ ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్ చేసారు.

**ఒక వార్డెన్ మూడు హాస్టల్స్:**

సాంఘీక సంక్షేమ శాఖలో వార్డెన్ల కొరత ఉంది. దాంతో పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉందని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీకాళహస్తి బిసి హాస్టల్‌లో చోటు చేసుకున్న సంఘటనలో పర్యవేక్షణ కొరవడిందని కూడా చెప్పవచ్చు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పల్లా వెంకటేశ్వర్లు మూడు హాస్టళ్ళకు ఇన్‌చార్జిగా ఉన్నారు. శ్రీకాళహస్తితో పాటు ఏర్పేడు, రేణిగుంట హాస్టల్స్ పర్యవేక్షిస్తున్నారు. దాంతో పులిసిన పిండితో ఇబ్బందులు ఎదురయ్యాయి.

## తోతాపురికి గిట్టుబాటు ధర చెల్లించాలి

### - ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం
### మార్కెట్ యార్డు ఎదుట వైకాపా నాయకులు, మామిడి రైతులు ధర్నా



బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న వైకాపా నాయకులు, మామిడి రైతులు.

బంగారుపాళ్యం, జూన్ 24 ప్రభాతవార్త: ఈ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించినట్లు తోతాపురి మామిడి కేజీకి రూ.12 రైతులకు చెల్లించాలని పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పూతలపట్టు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట వైకాపా నాయకులు, మామిడి రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గత సీజన్‌లో పల్ప్ ఫ్యాక్టరీల వద్ద తయారైన పల్ప్ నిల్వలు అలాగే వుండటంతో ఈ సీజన్‌లో పల్ప్ ఫ్యాక్టరీలు పల్ప్ తయారీకి సిద్ధం కాలేదన్నారు. సీజన్ ప్రారంభానికి నాలుగు నెలల ముందే ప్రభుత్వం స్పందించి జిల్లాలో వున్న పల్ప్ ఫ్యాక్టరీల వద్ద నిల్వ వున్న పల్ప్‌ను ఎగుమతి చేయడానికి చర్యలు తీసుకుని వుంటే ప్రస్తుతం మామిడి రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఇటు పల్ప్ ఫ్యాక్టరీలు మామిడిని కొనుగోలు చేయకపోవడం, ఎగుమతులు సరిగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఆలస్యంగా స్పందించి మామిడి రైతుకు ఈ సీజన్‌లో చెల్లిస్తామని ప్రకటించిన కేజీ తోతాపురి రూ.12కి కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రూ.4 సబ్సిడీ చెల్లిస్తామని చెప్పినా ఆ మొత్తం ఎప్పుడు జమ అవుతుందనే విషయం తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు కేజీపై రైతుకు రూ.8 చెల్లించాల్సి వున్నప్పటికీ జిల్లాలోని ఏఒక్క ఫ్యాక్టరీ రైతుకు కేజీపై రూ.3 కంటే ఎక్కువ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. సిఎం చంద్రబాబునాయుడు రైతుకు శత్రువుగానే వ్యవహరిస్తున్నారని, 2014లో రైతు రుణ మాఫీ అంటూ వారికి కుచ్చుటోపి పెట్టారని ఎద్దేవా చేశారు. జిల్లాలో 6 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి వున్నప్పటికీ కేవలం 1 లక్ష మెట్రిక్ టన్నులు మాత్రమే పల్ప్ ఫ్యాక్టరీలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లి మండలాల వైకాపా కన్వీనర్లు రామచంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, జిల్లా నాయకులు గౌతమి సుబ్బారెడ్డి, థామస్, పరమేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డితో పాటు నాయకులు గజేంద్ర, దత్తురెడ్డి, మొగిలీశ్వర్, కిషోర్‌కుమార్‌రెడ్డి, సాకీర్, రఘు, నాగరాజు, అశోక్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

### గాజులపల్లి ర్యాంపుల వద్ద మామిడి రైతుల నిరసన

తవణంపల్లి, జూన్ 24 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ-బంగారుపాళ్యం రహదారిలోని గాజులపల్లి సమీపంలో ర్యాంపు నిర్వాహకుల వైఖరికి నిరసనగా మామిడి రైతులు మంగళవారం నిరసన చేపట్టారు. రోజు రోజుకు మామిడి ధరలు పడిపోతుండటంతో రైతులకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తాము పండించిన మామిడి పంటను విక్రయానికి ర్యాంపుల వద్దకు తీసుకువస్తుండటంతో వారు కేవలం తోతాపురి మామిడికి టన్నుకు రూ.2,500 వేలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాము చెప్పిన ధరకు విక్రయించండి! లేదా ఇక్కడి నుండి మామిడి పంటను తీసుకెళ్ళండి! అంటూ ర్యాంపు నిర్వాహకులు రైతులకు స్పష్టం చేయడంతో మామిడి రైతులు ఆగ్రహించి ట్రాక్టర్లతో తాము తెచ్చిన తోతాపురి మామిడి కాయలను నడిరోడ్డుపై కుమ్మరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మద్దతు ధర కోసం అధికారులు ఇక్కడికి రావాలంటూ రైతులు డిమాండ్ చేశారు. దీంతో బంగారుపాళ్యం-అరగొండ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



ర్యాంపుల వద్ద రోడ్డుపై మామిడి కాయలు కుమ్మరించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు.

## కన్నుల పండువగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం అమా వాస్య సందర్భంగా గ్రామోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా గ్రా మోత్సవం పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని కోట మండపం వద్ద ఊంజల్‌సేవను నిర్వహిం చటం ఆనవాయితిగా వస్తుంది. అమావాస్య సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ ఓ మోస్తరుగా ఉంది. అంతేకాక ఉదయం నుంచి వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం, రాజగోపురం నుంచి రాగా అలంకార మండపం నుంచి విశేషంగా మేళ తాళాలు, తమిళనాడు వాయిద్యాలతో ఉత్సవాన్ని ముందుకు సాగించారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షణలో ఉత్సవం ఘనంగా సాగింది. ఉత్సవం నాలుగు మాడావీధుల్లో సాగింది.

## సూళ్లూరుపేటలో శ్రీజగన్నాథ రథయాత్ర ట్రయల్ రన్

సూళ్లూరుపేట, జూన్ 24 ప్రభాతవార్త



సూళ్లూరుపేట కేంద్రంగా ఈ నెల 28న నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రకు సంబంధించి మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. నెల్లూరులోని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించి ముందుగా ట్రయల్ రన్ నెల్లూరు ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు శుకదేవ్ మహరాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. జగన్నాథ రథయాత్ర ప్రారంభమయ్యే షార్ బస్టాండ్ నుంచి శ్రీచెంగాళమ్మ ఆలయానికి సమీపంలో ఉన్న శ్రీనగర్ కాలనీ వరకు రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ హరేకృష్ణ భజనలతో నగర సంకీర్తన చేస్తూ ట్రయల్ రన్ చేపట్టారు. నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షులు శుకదేవ్ మహరాజ్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన శ్రీ జగన్నాథ రథయాత్రను సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒరిస్సా రాష్ట్రంలోని పూరీలో శ్రీ జగన్నాథ రథయాత్ర ఇదే తేదీలో నిర్వహిస్తున్నారని, ఆ సమయంలోనే సూళ్లూరుపేటలో రథయాత్ర జరుగుతుందని తెలిపారు. గతంలో కొవిడ్‌కి ముందు రెండు పర్యాయాలు రథయాత్ర నిర్వహించి ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం జరిగే రథయాత్రకు ఇస్కాన్‌కు సంబంధించి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. విదేశీయులతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి ఇస్కాన్ సభ్యులు హాజరవుతారని చెప్పారు. సూళ్లూరుపేట ఇస్కాన్ సభ్యులు రాజగోపాల్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధికోసమే పరామర్శలు

### - జగన్‌పై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శ



తిరుపతి విద్య, జూన్ 24 ప్రభాతవార్త

రాజకీయ లబ్ధి కోసం జగన్మోహన్ రెడ్డి మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. అల్లరి మూకల జేజేల కోసం తన కారు కింద పడి కార్యకర్త ప్రాణాలు పోతున్నా పక్కకు లాగి పడేసి సింగయ్య చావుకు జగన్మోహన్ రెడ్డి కారకుడైయ్యారని ఆయన తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో విమర్శించారు. సింగయ్య కుంటుంబాన్ని పరామర్శించకుండా పోవడంతోపాటు మరో కార్యకర్త గుండెపోటుతో మృతి చెందితే పట్టించుకోని నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని ఆయన అన్నారు. పరామర్శకు వెళ్ళే ముందు పోలీసుల సూచనలను జగన్ పక్కన పెట్టి బలప్రదర్శనకు దిగుతుండటంతో కార్యకర్తల ప్రాణాలు పోతున్నాయన్నారు. జగన్మోహన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులు ఇష్టానుసారం వ్యవహరిస్తే తొక్కి నారతీస్తామని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ హెచ్చరించారని ఆయన గుర్తు చేశారు. ఉనికి కోసమే కరుణాకర్ రెడ్డి విమర్శలు చేస్తున్నారు అని అన్నారు. తాను కానీ, ఎన్డీఏ కూటమి నాయకులు కబ్జాలకు, దౌర్జన్యాలకు పాల్పడి ఉంటే మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నిరూపించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సవాల్ విసిరారు. వైన్ షాపులు గత ప్రభుత్వ హయాంలో 24గంటలు ఓపెన్ చేసి నాసిరకం మద్యం అమ్మిన చరిత్ర కరుణాకర్ రెడ్డి మరిచిపోయినా ప్రజలు మరిచి పోలేదని ఆయన అన్నారు. మున్సిపల్ కార్పోరేషన్ పరిపాలన భవనం పెండింగ్ పనుల పూర్తికి చాణిక్య లాడ్జి స్థలాన్ని అమ్మాలని ఎవరికీ లేదన్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయంపై కమిటీ వేసి ఆ కమిటీ సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని చెబితే వైసిపి కార్పోరేటర్లే బల్లలు చరిచి మద్దతు ఇచ్చారని ఆయన చెప్పారు. టౌన్ బ్యాంక్ లో జరిగిన అక్రమాలపై అధికారుల కమిటీ విచారణ చేపట్టిందని, కొందరు డైరక్టర్లు అప్రూవర్స్‌గా మారి నిజాలు చెప్పారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, బాబ్జీ, మునస్వామి, ఆకేపాటి సుభాషిణి, అనీల్ రాయల్, హేమకుమార్, వెంకటేష్, జానకి రామ్, పగడాల మురళీ, రాధా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో యు.కె.డిప్యూటీ హైకమీషనర్ సందర్శన



తిరుపతి విద్య జూన్ 24 ప్రభాత వార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని యునైటెడ్ కింగ్‌డమ్ డిప్యూటీ హైకమిషనర్ విన్ ఓవెన్ సందర్శించారు. యు.కె. ఆంధ్రప్రదేశ్ మధ్య బలమైన సంబంధాలను పెంపొందించడం ఈ పర్యటన లక్ష్యం. అందులో భాగంగా విద్య, సాంకేతికత, ఆర్థిక అభివృద్ధి రంగాలను పరిశీలిస్తామన్నారు. వారు తన పర్యటన సందర్భంగా యస్వీయూ వైస్ ఛాన్సలర్, ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాల్స్, డీన్స్ వారికి స్వాగతం పలికారు. విద్యావృద్ధి ఆవిష్కరణలకు ప్రయోజనం చేకూర్చడానికి, కృత్రిమ మేధస్సు, జీవ శాస్త్రాలతో సహా వివిధ రంగాలలో యు.కె. యొక్క నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడంలో డిప్యూటీ హై కమిషనర్ ఆసక్తిని వ్యక్తం చేశారు. వారు మాట్లా డుతూ, భారతీయ సంస్థలు, పరిశ్రమలతో బలమైన భాగస్వామ్యాలను నిర్మించడానికి యు.కె. అంకితభావాన్ని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ డైనమిక్ విద్యా దృశ్యాన్ని, అభివృద్ధి చెందుతున్న ఐ టి రంగంలో సహకారానికి అపారమైన అవకాశాలను వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ రాయల, లక్ష్మీ పడిలేటి, శ్రీనివాస్ పూర్వ అధ్యక్షులు, ఎన్ఇఐఎల్ఐటీ తిరుపతి డైరెక్టర్ శశి కుమార్ పాల్గొన్నారు.

# వాదులచెరువు చెరపడుతున్నారు

## - పగలు..రాత్రి తేడా లేకుండా మట్టి తరలింపు !!!

**శాంతిపురం, జూన్ 24 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో కొంతమంది అక్రమార్కులు చెరువుల చెరపడుతున్నారు. కుప్పం - పలమనేరు జాతీయ రహదారి పక్కనే తుమ్మిశి వద్దగల వాదుల చెరువులో పగలు,రాత్రి జెసిబి యంత్రాలు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ చెరువు నిండితే ఆయకట్టు కింద భూములు సైతం సాగవుతాయి. అయితే గతకొన్ని రోజులుగా కొంతమంది స్వార్థపరులు చెరువు అనే విషయం కూడా గమనించక ఇష్టారాజ్యంగా చెరువులో గుంతలు తీసి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. నిత్యం ఈ మార్గంలో జిల్లా, మండల అధికారులు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొంతమంది నేతలు తాము ఆడిందే ఆటగా భావిస్తూ చెరువులో మట్టి తరలింపుకు ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. పత్రికల్లో వార్తలు వస్తే ఒకటిరెండు రోజులు చెరువులో మట్టి తవ్వకాలు ఆపేయడం మరలా తవ్వి మట్టి తరలించడం అలవాటుగా మారిపోయింది. చెరువును ఇష్టారాజ్యంగా తవ్వడంతో కుప్పం - పలమనేరు జాతీయ రహదారి కిందిభాగం కూడా దెబ్బతినే ప్రమాదం లేకపోలేదదు. ఈ విషయంగా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరాలి

**- తెలుగుయువత రాష్ట్ర నేత మణి**

**కుప్పంరూరల్, జూన్ 24 ప్రభాతవార్త**



విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి పేర్కొన్నారు. మంగళవారం కనమపచ్చార్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను ప్రభుత్వం తరపున పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సిఎం చంద్రబాబు తల్లికివందనం పథకం అమలు చేశారన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నేతలు కనకరాజు, దేవేంద్ర, బీరప ్ప, తిమ్మప్ప, శరవణ, వెంకటేష్ పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలేవి?

**- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు**

**- కార్పొరేట్ విద్యాసంస్థ ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా**

**చిత్తూరురూరల్, జూన్ 24 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణంలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల వద్దనుండి అధిక ఫీజులతో పాటు యూనిఫాం, టెక్ట్స్ బుక్స్, షూల పేర్లతో లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారనీ ఏఐఎస్ఎఫ్ నాయకులు దుయ్యబడుతూ ఓ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర సహాయకార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఎక్కడాగాని విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని, ప్రైవేట్ కార్పొరేటర్ పాఠశాలలపైన తనిఖీలు నిర్వహించి వారి మీద చర్యలు తీసుకున్న చర్యలు ఇంతవరకు జరగలేదన్నారు. పలు విద్యాసంస్థల్లో వారి వద్దే టెక్ట్ బుక్స్, యూనిఫాంలు, బెల్టులు తీసుకోవాలని ఒక దుకాణాన్ని నడుపుతున్న జిల్లా యంత్రాంగం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వనిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న పాఠశాలలపైన చర్యలు తీసుకొని యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మున్నా, నాయకులు యోగేష్, నిరంజన్, శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కార్మికుల వంటావార్పు నిరసన

**పుంగనూరు రూరల్, జూన్ 24, ప్రభాతవార్త**



మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వంట వార్పుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. 11వ రోజు కొన సాగిన ఈ నిరసనలో కార్మికులు హెచ్ఆర్ అమలు చే యాలని, కనీస వేతనం మంజూరు చేయాలని, సం క్షేమ పథకాలు అమలు చేయాలని, కారుణ్య ని యా మకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్ శరీరంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి ముగ్గురు విద్యార్థులు ఎంపిక

**చౌడేపల్లి, జూన్ 24 ప్రభాతవార్త**



ప్రతిష్టాత్మకంగా భావించే ట్రిపుల్ ఐటికి పుదిపట్ల ఉన్నతపాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. పాఠశాలలో పదిపాసై ఉత్తమ ప్రతిభ కనబరచిన పూజిత, జశ్విత, మనోజ్‌కుమార్‌లు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

## విద్యార్థుల నమోదు శాతాన్ని అధిగమించడంపై అభినందన

**కల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త:**



మంగళంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (తరగతులు 1-5) లో విద్యార్థుల సంఖ్య 100కు చేరిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధురాంతకం మోహన్, ఉపాధ్యాయ బృందాన్ని మండల విద్యాశాఖాధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు తాతయ్య పోకల, సిద్ధరామయ్య, క్లస్టర్ హెచ్ఎం చైర్‌పర్సన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యా నాణ్యతను పెంపొందించడం, పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల నమోదు పెరగడాన్ని అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యార్థులకు శిక్షణ అందించడంలో, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా పాఠశాల స్థాయి ప్రగతిని సాధించడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విద్యా కార్యక్రమాలను అమలు చేసి, విద్యార్థుల భవిష్యత్తును ఉన్నత స్థాయికి చేర్చే విధంగా పాఠశాల పని చేయాలని అధికారులు సూచించారు. తల్లిదండ్రులు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యాసంలో పాఠశాల ఉపాధ్యాయులకృషినిప్రశంసిస్తూ,మంచి భవిష్యత్తుకై అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## వైస్ ఎంపిపి భర్తపై పోలీసులకు దేశం నేతల ఫిర్యాదు

**కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త**



కుప్పం మండల వైస్ ఎంపిపి భర్త, వైకాపా నాయకుడు మిట్టపల్లి షౌకత్ అలీపై మంగ ళవారం బంగానత్తం సర్పంచ్ రవి, గ్రామ స్తులు, మైనార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మార్వాడ గ్రామంలో శివశంకర్ అనే వ్యక్తి చనిపోతే టిడిపి నేతలు అడ్డుకున్నారని వైఎస్ జగన్‌కు చెందిన మీడియాలో తప్పుడు కథనం వచ్చిందన్నారు. అయితే అదే కథనాలను షౌకత్ అలీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. ఇది మంచి పద్దతి కాదన్నారు. అసలు షౌకత్ అలీ మార్వాడ గ్రామస్తుడే కాదని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తే సహించేది లేదన్నారు. మార్వాడలో ఏదో జరిగిపోయిందని వైఎస్ జగన్‌కు చెందిన మీడియాలో అవాస్తవాలు పేర్కొనడం దారుణమన్నారు. ఈవిషయంగా వైస్ ఎంపిపి భర్త షౌకత్ అలీతో పాటు జగన్ మీడియాపై తగు చర్యలు తీసుకోవాలని వారు కుప్పం డిఎస్పీ పార్థసారథి, అర్బన్ సిఐ శంకరయ్యలకు మూడు వేర్వేరు ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో బంగానత్తం సర్పంచ్ రోహిత్ రవి, తెదేపా మైనార్టీ విభాగం నేతలు మునాఫ్, షరీఫ్, హైదర్ వలీ, పలువురు బంగానత్తం గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు మెరుగైన వైద్యసేవలు

**చిత్తూరురూరల్, జూన్ 24 ప్రభాతవార్త:**



చిత్తూరుపట్టణం, సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు ఎప్పట కప్పుడు మెరుగైన సేవలందిస్తు న్నట్లు నిర్వాహకులు జోసఫ్‌రాజు తెలిపారు. మంగళవారం ఆర్‌విఎస్ హాస్పటల్ వైద్యనిపుణులు సహకా రంలో వసతి గృహంలోని నిరాశ్ర యులకు ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటుచేసారు. ఈ శిబిరంలో వైద్యనిపుణులు నిరాశ్రయులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసి, వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విఎస్ డాక్టర్లు ఖలీద్, శిబిన్, షబీన్, జావీర్, పిఆర్ఓ వినోద్‌కుమార్, నర్సులు దీప, నిత్యశ్రీలతో పాటు వసతిగృహ సిబ్బంది ప్రమీల, శశిరేఖ, శ్రీనివాస్, సుందర్‌రాజ, రఘుపతి పాల్గొన్నారు.

## ముతాలంలో మంచినీటి సమస్య పరిష్కారం

**వెదురుకుప్పం, జూన్ 24 ప్రభాతవార్త :**



మండలంలోని గంటావారిపల్లె పంచా యితీ ముతాలం గ్రామంలో గత కొంత కాలంగా మంచినీటి సమస్యల నెలకుంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చొరవతో సర్పంచ్ శ్రీనాధ్‌రెడ్డి నూతనంగా బోరు వేయించారు. కావలసిన మేరకు బోరు నుంచి మంచినీరు రావడంతో ముతాలం ప్రజల దాహార్తి తీరందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ జడ్పీ నిధులతో బోరు వేయడం జరిగిందన్నారు. గ్రామస్థులు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రదోష కాలపూజ



**వెదురుకుప్పం, జూన్ 24 ప్రభాతవార్త :**

మండలంలోని చవటగుంటలోగల మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర ఆలయంలో ఘనంగా ప్రదోష కాల పూజలు నిర్వహించారు. ఆలయం శుద్ధి చేసి స్వామివారికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలం కరించారు. అనంతరం నందీశ్వరునికి వివిధ అభి ్షేకాలు నిర్వహించి వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దైవర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. పురోహితులు టంగుటూరు రవిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణా రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

**కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వా మివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన గుండాల్‌రెడ్డి అనే భక్తుడు నిత్యా న్నదానంకు 1,00,116 రూపా య లను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా ్న్ని దాతలు ఆలయ సూపరెం డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అంద జేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసా దాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు

## - రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్

**చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:**



రాష్ట్ర వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మానవత్వం, బాధ్యత లేకుండా రాజకీయ ఉన్మాదిగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ రాజకీయం ముసుగులో హింస, అరాచకంను ప్రేరిపిస్తూ ముఠా నాయకుడిగా వ్యవహరిస్తున్నారని, బాధ్యత లేకుండా రాజకీయాలను దిగజారుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచకం, హింసను సృష్టించడానికి వైకాపా శ్రేణులను ఉన్మాదుల్లా ప్రోత్సహిస్తున్నారని, ఇందులో కొందరు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ పరామర్శల పేరిట బలప్రదర్శనలకు దిగి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. పొదిలిలో వైకాపా కార్యకర్తల అరాచకం అనంతరం ప్రజల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ వైఎస్ జగన్ పల్నాడు పర్యటనకు కొన్ని సూచనలు చేసిందన్నారు. బల ప్రదర్శన లేకుండా పరామర్శకు అనుమతి ఇచ్చిందని, అయితే వైఎస్ జగన్ ప్రతి అంశంను రాజకీయం చేస్తూ కుట్ర వ్యూహాలను అమలు చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్ పర్యటనతో ఇద్దరు వైకాపా కార్యకర్తలు మృతి చెందారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, వైకాపా నాయకులు కృష్ణమూర్తి, మేషక్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు

**- జిల్లా బిజెపి నాయకుడు చిట్టిబాబు కొల్లా**



**చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:**

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులు కదిలించిన ఎమర్జెన్సీ విధించిన రోజుకు 50 సంవత్సరాలు పూర్తయ్యాయని జిల్లా బిజెపి అధ్యక్షుడు చిట్టిబాబు కొల్లా అన్నారు. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 21 నెలల పాటు దేశంలో అత్యవసర పరిస్థితి విధించి ప్రజాస్వామ్యంకు ఎమర్జెన్సీ రూపంలో తీవ్ర ముప్పు తెచ్చారన్నారు. నేటి తరానికి అది ఒక చిన్న అంశం మాత్రమే అనిపించినప్పటికీ అనాడు జరిగిన పర్యవసనాల గురించి యువతరం తెలుసుకోవాల్సిన అవస రం వుందన్నారు. పత్రికలపై సెన్సార్‌షిప్, రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, విద్యార్థులు, మహి ళల బలవంతపు అరెస్టులు, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎన్నో ఎమర్జెన్సీ వున్న 21 నెలల్లో ప్రజలు చవిచూడటం జరిగిందన్నారు. ఒక స్వార్థపూరిత నాయకురాలి నిరంకుశ మనస్తత్వం వల్ల దేశ ప్రజాస్వామ్యంకు తూట్లు పడ్డాయన్నారు. అందుకు జూన్ 25వ తేదీని సంవిధాన్ హత్యా దివస్‌గా పరిగణిస్తామన్నారు.

## రేపు కుప్పం పార్కు అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణ

**మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు**



కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త

కుప్పం పట్టణ సమగ్ర అభివృద్ధి లో భాగంగా కుప్పం పట్టణ నడిబొడ్డున ఉన్న కుప్పం సెంట్రల్ పార్క్ అభివృద్ధిపై గురువారం కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కుప్పం సెంట్రల్ పార్కులో గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం తదితరులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కుప్పం మున్సిపాలిటీలో ఉన్న ప్రజలు, ప్రముఖులు ,మేధావులు ఈ కార్యక్రమానికి హాజరై తమవంతుగా తగు సలహాలు సూచనలు అందించాలని కమిషనర్ కోరారు.

## ఐటిఐ కాలేజీలో రెండో దఫా అడ్మిషన్లకు అవకాశం

**శాంతిపురం, జూన్ 24 ప్రభాతవార్త**

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో చేరేందుకు రెండో దఫా అడ్మిషన్లకై దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జూలై 17న కళాశాలలో దరఖాస్తులు పరిశీలించుకోవాలన్నారు. జూలై 21వతేది మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని ఆయన కోరారు.

## తెదేపా కార్యకర్త మృతి.. ఆర్థికసాయం

**రామకుప్పం, జూన్ 24 ప్రభాతవార్త**

మండలంలోని బందార్లపల్లికి చెందిన తెదేపా కార్యకర్త వెంకటేశప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నేతలు బందార్లపల్లికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ఎనిమిదివేల ఐదువందల రూపాయలు సాయం అందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునిరెడ్డి, శ్రీనాథరెడ్డి, ఆనందప్ప, రఘుపతిరెడ్డి, సుబ్రమణ్యం, బాబు, రాధప్ప పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జీ మంత్రిని కలిసిన పి.షణ్ముగం

**చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:**



జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మంగళవారం అమరావతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ, మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ పి.షణ్ముగం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి ప్రసాదాలు అందజేసి ఆయనను సన్మానించారు. షణ్ముగం మంత్రితో మాట్లాడుతూ జిల్లా తెలుగుదుశం మహిళా కార్యదర్శి దుర్గ మృతి విషయంపై ఆపోలో ఆసుపత్రి డాక్టర్లు, దాని యాజమాన్యంపైన నిర్ణయం తీసుకోవడానికి ఆలస్యం జరుగుతోందని, ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి చేయాలని కోరారు.

## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభం

**తిరుపతి విద్య, జూన్ 24 ప్రభాతవార్త**



మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 400వ షోరూమును మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ ఘనంగా ప్రారంభించారు. సందర్భంగా చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ మా 400వ షోరూమ్‌ను ప్రారంభించడం ప్రపంచ వ్యాప్తంగా నంబర్ 1 గ్లోబల్ జ్యువెలరీ రిటైలర్గా పేరుగాంచాలనే మా ప్రయాణంలో నిరంతరం విస్తరిస్తున్న మా అడుగుజాడలను సూచిస్తుంది అని అన్నారు. మా లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రముఖ పాత్ర పోషించిన మా కస్టమర్లు, నిర్వహణ బృందం సభ్యులు, వాటాదారులు, ఇతర స్టేక్ హోల్డర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఓ.ఆషర్, గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పి.వీరన్కుట్టి, గ్రూప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సలీష్ మాథ్యూ, రిటైల్ ఆపరేషన్స్ హెడ్ పి.కె.సిరాజ్ (రెస్ట్ ఆఫ్ ఇండియా) రీజినల్ హెడ్ ఎన్.కె.జిషాద్, మేనేజ్మెంట్ బృందంలోని ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి ఎంపికైన ముగ్గురు విద్యార్థులు

**యర్రావారిపాలెం, జూన్ 24, ప్రభాతవార్త**

యర్రావారిపాలెం మండలం ఏపి మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు, ఉదయశ్రీ, రోష్ణ ,జ్ఞానేశ్వర్ ట్రిపుల్ ఐటికి ఎంపిక ఐనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ బి సరళ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సరళ మరియు స్కూల్ కమిటీ చైర్మన్, కమిటీసభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. మోడల్ స్కూల్ నందు ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉన్నతప్రమాణాలతో విద్యను అందిచడంవలన మోడల్ స్కూల్ మంచిఫలితాలు సాధించింది అని తమపిల్లలకు ట్రిపుల్ ఐటిలో సీటు రావడంతో ఆనందంగా ఉందని పిల్లలతల్లితండ్రులు సంతోషంవ్యక్తం చేశారు.

# మాబడిని మార్చితే ఎలా? దూర ప్రాంతాలకు వెళ్ళలేం

తొట్టంబేడు, జూన్ 24 ప్రభాతవార్త

ప్రభుత్వం పాఠశాలల విలీనాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో నిరసనలు,ఆందోళనలు చేపడుతున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్య లేకున్నా పాఠశాలలు కొనసాగేవి. ప్రభుత్వం కూటమి ప్రభుత్వంలో యువకుడైన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ పలుసంస్కరణలు చేపట్టారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో కూడా ఇవ్వని యూనిఫారాలను అందించారు. పాఠశాల ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు అందించారు. అయితే విద్యార్థు సంఖ్యలేని పాఠశాలలను విలీనం చేయటానికి ఆదేశించారు. ఈ



నేపథ్యంలో తొట్టంబేడు మండలంలోని శివనాథపురం గ్రామంలోని పాఠశాలను రామచంద్రాపురానికి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయించింది, ఈ నిర్ణయం పై పాఠశాల పరిధిలోని తల్లిదండ్రులు మంగళవారం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. పాఠశాల ను మార్చవద్దంటూ నిరసన తెలిపారు. నిరుపేద ప్రజల పిల్లలకు అందుబాటులో ఉండాల్సిన పాఠశాలలను సంస్కరణల పేరుతో మార్చితే4 కిలో మీటర్లు వెళ్ళటం సాధ్యమా? అని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించి మా బడిని మాకే ఉండేలా చూడాలని తల్లిదండ్రులు డిమాండ్‌చేసారు.

## మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక అవగాహన సదస్సు

పుత్తూరు రూరల్, జూన్ 24 ప్రభాతవార్త:




పుత్తూరు మున్సిపాలిటీ గోవిందపాళెంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ పుత్తూరు ఎక్సైజ్‌స్టేషన్ ఆధ్వర్యంలో మాధక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.సుభాషిణి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి లేదా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే చెడు పరిణామాలు గురించి తెలియజేస్తూ ఆల్కహాలు, కోకోయిన్, గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలను సేవించినప్పుడు టోపమైన్ అనే ఫీల్‌గుడ్ హార్మోన్ విడుదల కావడం వల్ల యువత మత్తులో ఆనందాన్ని పొందుతూ దీనిని వ్యసనంగా మార్చుకుంటున్నారని, డ్రగ్స్ వినియోగం వల్ల చేతులు, కాళ్లు వనకడం, మాట తడబడడం, కళ్ళ కింద నల్లని చారలు ఏర్పడి వయసు మీరినట్లు కనబడుతారని తెలిపారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మురళీమోహన్ మాట్లాడుతూ ఒక సారి డ్రగ్స్ అలవాటు పడితే జీవన శైలి మారిపోయి తమ బాధ్యతలను మరచిపోతారని తెలిపారు. డ్రగ్స్ కోసం దొంగతనాలు చేస్తూ అమూల్యమైన వారి జీవితాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. అసాధారణ మార్పులను తల్లిదండ్రులు గుర్తించి డి అడిక్షన్‌సెంటర్లను సంప్రదించి కౌన్సిలింగ్ ఇప్పించడం వలన ఈ సమస్యను నివారించవచ్చని తెలియజేశారు. డ్రగ్స్ గంజాయి వంటి మాధక ద్రవ్యాల రవాణా, వినియోగం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండి టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ అంజాద్ బాషా, సిబ్బంది, కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ మాణిక్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మఠాల వద్ద సెక్యూరిటీ ఏర్పాటుచేసుకోవాలి

-ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్

తిరుమల,జూన్ 24ప్రభాతవార్తప్రతినిధి:



యాత్రికుల సంఖ్య పెరగడంతో వాహనాలు కూడా అదేస్థాయిలో చేరుకుంటున్నాయి. భక్తులు చాలావరకు తమకు అద్దె గదులు దొరకని పక్షంలో తిరుమలలోని అనేక మఠాలపై ఆధారపడుతున్నారు. మఠాలలో గదులు తీసుకున్న భక్తులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ఆ మార్గాల్లో వెళ్ళే యాత్రికులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ ఆదేశాలతో ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్,క్రైమ్ సిఐ శేషాద్రి మంగళవారం తిరుమలలో మఠాల నిర్వాహకులు, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు.

## పని భారంపై స్పష్టత ఇవ్వాలి

శ్రీకాళహస్తి రూరల్,జూన్ 24 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలో సచివాలయాలను విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా అధిక పనిభారం ప్రమోషన్స్ లేకపోవటం బదిలీలపై స్పష్టత లేకపోవటంపూ మండల పరిషత్ అధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 నుంచి మండలంలో విధులు నిర్వహి స్తున్నట్లు వివరించారు. గ్రామంలో పంచాయతీరాజ్,నీటి సరఫరా, స ర్వశిక్షా అభియాన్ గృహనిర్మాణ సంస్థలకు సంబంధించిన ఇంజనీరింగ్ పనులను క్షేత్రస్థాయిలో చేస్తున్నట్లు వివరించారు. ఇవి కాక పలుసర్వేలు, బిఎల్ఓ డ్యూటీలను కకూడా తమ చేతనే చేయిస్తున్నారని వారి బాధలను వివరించారు. 6 సంవత్సరాల సర్వీసు ముగిసినా ప్రభుత్వం తగిన ప్రమోషన్లు కానీ ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన రేషనైలేజేషన్‌లో భాగంగా ఒరెండుమూడు సచివాలయాలను విలీనం చేసారన్నారు. ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చేయాల్సిన పని ఒకరు చేయాల్సి వస్తుందన్నారు. దీని వల్ల పనిభారం పెరుగుతుందన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పందించాలని తమకు న్యాయంచేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విద్యుత్ వినియోగదారులక వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించుటకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ తిరుపతి రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం.చిన్నరెడ్డెప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సును పట్టణంలోని మహేష్ కళ్యాణ్ సదన్‌లో బుధవారం ఉదయం 10గంటలకు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్‌యోజన పథకంలో ఎన్నో సదుపాయిలు కల్పించిందని ఈ అంశాలకు సంబంధించి వివరించుటకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది కేవలం గృహోపయోగకర వినియోగదా రులకు మాత్రమే చిన్న రెడ్డెప్ప వివరించారు.

## జగన్మోహన్‌రెడ్డిని కలిసిన చిన్నియాదవ్

తిరుపతిరూరల్, జూన్24 ప్రభాతవార్త:



మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డిని వెంకటపతినగర్ గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్( చిన్ని యాదవ్) మర్యాద పూర్వకంగా కలిసారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా బిసి వైకాపా అధ్యక్షు డుగా పార్టీకి సేవలు అందిస్తున్న చిన్నియాదవ్‌ను జగన్‌రెడ్డి ఆప్యా యంగా పలకరించి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా చిన్నయాదవ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయటానికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

## మత్తు జోలికి వెళితే బానిస బతుకులే

ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్

చంద్రగిరి, జూన్ 24 ప్రభాతవార్త



విద్యార్థులు మత్తు పధార్థాల జోలికి వెళితే బానిస బ్రతుకులు తప్పవని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) ను పురస్కరించుకుని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మంగళవారం చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మత్తుపధార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలబారినపడి ఎంతో మంది తమ విలువైన జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. మీ ఉజ్వల భవిష్యత్‌ను అందిపుచ్చుకునే దిశగా విద్యార్థి దశను మలుచుకోవాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎక్సైజ్ ఎస్ఐలు ఎం.సుధాకర్ రావు, కె.గిరి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్ ఆర్.చిరంజీవి, కె.జానకిరామయ్య, సిబ్బంది ఏ.సురేంద్రబాబు, శోభన, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బ్రిటిష్ హై కమిషనర్‌ను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్

తిరుపతి విద్య జూన్ 24 ప్రభాత వార్త

రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మరియు తిరుపతి డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్



వారి ఆధ్వర్యములో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ (వాణిజ్య విభాగము) చెందిన గారెత్ విన్ ఓవెన్ మంగళవారం కలిశారు. ఆయనకు సత్కరించడం జరిగింది. తిరుపతి పరిసర ప్రాంతములోని ముఖ్యమైన సాఫ్ట్ వేర్ కంపెనీల ప్రతినిధులు, ప్రముఖ వ్యాపారస్తుల ను కలిశారు. ఈ సందర్భంగా బ్రిటిష్ హై కమిషనర్ మాట్లాడుతూ,బ్రిటన్ నందు వ్యాపారములు స్థాపించి,అభివృద్ధి చేయవలెనని తెలియజేస్తూ, వ్యాపారస్తులకుఇవ్వబడినటువంటి అన్నీ రకాల సౌకర్యాలను వివరముగా తెలియజేశారు. రాయలసీమ జోన్ చైర్మన్,జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కె.వి చౌదరి, ముండ్లూరు సూర్య, హోటల్ సింధూరి పార్క్ డైరెక్టర్ శ్రీధర్ బాబు, శశిధర్ బాబు,సిఐఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు విజయ్ గళ్ళ పాల్గొన్నారు.

## జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి:

శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి న్యాయస్థానాల సముదాయ ఆవరణలో వచ్చేనెల 5నజరిగేజాతీయ లోక్ ఆదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ వివరిం చారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జూలై 5న లోక్ఆ దాలత్ నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సివిల్,క్రిమినల్, చెక్ బౌన్సు కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. ఈ లోక్ ఆదాలత్‌లో సమస్యలు పరిష్కారానికి వస్తే సమస్య పరిష్కరించు కోవటంతో పాటు అపిల్‌చేసుకునే అవకాశం ఉందన్నారు. ఉదయం 9గంటల నుంచి 3 గంటల వరకు జరిగే లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు

## తిరుచానూరు ఇంటిపన్నుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేస్తారా!... షోకాజ్ నోటీసుతో సరిపెడతారా!

తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త:

శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారు వెలసిన తిరుచానూరు గ్రామ పంచాయతీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గ్రామ పంచాయతీలో పెద్దఎత్తున ఇంటిపన్నులు స్వాహా చేసిన బిల్ కలెక్టర్‌కు కేవలం షోకాజ్ నోటీసు జారీ చేసి ఉన్నతాధికారులు చెయ్యి దులుపుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలోనే జనాభలోను, ఆదాయంలోను మేజర్ పంచాయతీ అయిన తిరుచానూరు గ్రామ పంచాయతీలో ఇంటిపన్నులు గోల్‌మాల్ పెద్దఎత్తున జరిగిన... కేవలం షోకాజ్ నోటీసుతో బిల్ కలెక్టర్‌ను కాపాడే యత్నం చేస్తున్నట్లు సమాచారం. తిరుచానూరు గ్రామ పంచాయతీకి ప్రతినెల రూ.3లక్షలకు పైగా ఇంటిపన్నులు వసూలు అవుతాయి. పంచాయతీలో ఇంటిపన్నులు వసూలుకు దాదాపు 12 మంది వరకు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉండగా, కేవలం ఒకరు మాత్రమే రెగ్యులర్ బిల్‌కలెక్టర్ ఉన్నారు. రోజువారీ బిల్ కలెక్షన్స్ నేరుగా ట్రెజరీకి చెల్లించాల్సి ఉండగా...బిల్ కలెక్టర్ చేతివాటం ప్రదర్శించి, ఇంటిపన్నులు స్వాహా చేసినట్లు ఆరోఫణలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో పెద్దఎత్తున ఇంటిపన్నులలో భారీ అవినీతి జరిగిందని గత ఇవో వ్రాతపూర్వకంగా పై అధికారికి ఫిర్యాదు చేసిన కేవలం షోకాజ్ నోటీసుతో సరిపెట్టుకున్నారని ఆరోఫణలు బలంగా వినిపిస్తున్నాయి.

తిరుచానూరు గ్రామ పంచాయతీలో జరిగిన ఇంటిపన్నుల అవకతవకలపై ఉన్నతాధికారులు ఎలాంటి విచారణ చేయకుండా, బిల్ కలెక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి, సర్దుమణిగేట్లు చేసారని సహచర ఉద్యోగులు అంటున్నారు. లక్షల్లో ఇంటి పన్నులు స్వాహా చేసిన బిల్‌కలెక్టర్‌పై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని మండలంలోని సహచర ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇంటి పన్నుల చెల్లింపులలో డిజిటల్ లావాదేవీలు ఎందుకు కొనసాగించ లేదని, కాంట్రాక్టు ఉద్యోగుల పాత్ర కూడా అవినీతిలో ఎంత ఉందో విచారణ చేయాల్సిన అవసరం ఉంది. అవినీతికి పాల్పడిన ఉద్యోగిపై సమగ్ర విచారణ చేసి, ప్రజాధనాన్ని తిరిగి ట్రెజరీకి కట్టిస్తారా! లేక షోకాజ్ నోటీసుతో సరి పెడతారా! అనే విషయం తెలాల్సి ఉంది. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి ఇంటిపన్నుల గోల్‌మాల్ సమగ్ర విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## స్కూటర్ ఢీకొన్న కారు-యువకుడు దుర్మరణం

మరొకరికి తీవ్రగాయాలు



నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త :

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం అయ్యావారికండ్రిగ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకిరికి తీవ్రగాయాలు ఏర్పడినది. ఈ ప్రమాదంలో కెవిబిపురం మండలం పాతపాలెం దళిత వాడకు చెందిన వి గుణశేఖర్(24) అక్కడక్కడే దుర్మరణం చెందగా, మోటారుసైకిల్‌లతో వెనుక కూర్చొని వున్న శివకుమార్‌కి తీవ్రగాయాలు ఏర్పడినది. ఈ ప్రమాదానికి సంబందించి వివరాలు ఇలా వున్నాయి. కెవిబిపురం మండలం పాతపాలెం దళితవాడకు చెందిన గుణశేఖర్ తిరుపతిలోని పిఎస్-4 హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. విధుల కోసం అతనితో పాటు శివకుమార్ ఎఫ్‌జడ్ ఎపి39ఆర్‌టి4862 స్కూటర్‌లో బయలుదేరారు. పాలమంగళం దాటుకున్న తర్వాత అయ్యావారికండ్రిగ వద్దకు వచ్చే సరికి తిరుపతి నుంచి చెన్నై వైపు వెలుతున్న టిఎన్22ఇఇ7770 నంబరు కలిగిన కారు అతివేగంతో వచ్చి మోటారుసైకిల్‌ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గునశేఖర్ మృతి చె ందగా, శివకుమార్‌కి తీవ్రగాయాలు ఏర్పడినది. తీవ్రంగా గాయపడ్డ శివకుమార్‌కి పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోకి తరలించి ప్రధమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు మెరుగైనా వైద్యంకోసం పోలీసులు తరలించారు. స్థానిక ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుణశేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం చేసిన తర్వాత బందువులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

## కాసులకు కక్కూర్తి పడింది:పోలీసుల్ని తిప్పలు పెట్టింది

అర్థరాత్రి వరకు విచారణ:

శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు వద్ద సోమవారం ఓ సచివాలయ ఉద్యోగి తనకు మత్తుమందు ఇచ్చి నగలు అపహరించారని అల్లిన కథతో పోలీసులకు ముచ్చెమటలు పట్టించింది. అర్థరాత్రి వరకు డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు నాగార్జున్‌రెడ్డి, డి.గోపిలు ఆమెను సమగ్ర విచారణ జరిపారు. సంఘటన జరిగినట్లు చెబుతున్న ప్రాంతాల్లో సిసి ఫుటేజీలను పరిశీలించారు. ఈ మిస్టరీ ఏమిటని క్రైమ్ విచారణలో ఎంతో అనుభవం ఉన్న సిఐలు ఛేదనలో పరుగులు తీసారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో తనకు మత్తుమందిచ్చినట్లు పేర్కొనింది. మత్తు మందు ఇస్తే ఎలా నడుస్తుందని ఆరా తీసారు.

**డబ్బుకు ఆశ పడి . . .**

ఈ మిస్టరీలో పోలీసులకు అందిన సమాచారం మేరకు సచివాలయ ఉద్యోగిని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఓ ఇద్దరు తారస పడ్డారు. వీరు సైబర్‌నేరాల్లో ఆరితేరిన వారుగా ఉన్నట్లు భావిస్తున్నారు. వారు ఆమె వద్ద బంగారం ఉండటాన్ని గమనించి ఆకలి పేరుతో దగ్గరయ్యారు. ఆమె అయ్యో అనటంతో ఆమెను తమ మాట వినేటట్లు చేసుకున్నారు. వారిలో ఒకడి వద్ద లక్షల రూపాయలు ఉన్నాయని కానీ వాడు బయటి ప్రాంతం వాడు కాబట్టి దాచుకోలేదని మీ వద్ద బంగారం ఇస్తే వాడికి ఇచ్చి పంపేస్తామంటూ డబ్బు ఆశ చూపాడు. దాంతో ముగ్గురు కలసి బార్‌కు పక్కనే ఉన్న సందులోకి వెళ్ళారు. అక్కడ సచివాలయ ఉద్యోగి చేతిలోని ఓ గాజును తీసి ఇవ్వగా వారు డడబ్బుల కట్టను అందించారు. ఆమె దాచుకొని ముగ్గురు బయలుదేరారు. బంగారం తీసుకున్న వారు మాయమయ్యారు. తీరా నగదు కట్ట తీసి చూసుకుంటే పైన రూ.500 నోట్లు లోపల తెల్లకాగితాలు దాంతో ఆమె తాను మోసపోయానని గ్రహించి 'కొత్త డ్రామా'అల్లింది. దాంతో పోలీసులకు రాత్రంతా విచారణతో సతమతం చేసింది. అసలు విషయం తెలుసుకున్న తరువాత పోలీసుల హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. మొదట ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఏమైనా దిగారా? అని అనుమానించారు.

## మంత్రి లోకేష్‌ని కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త :



రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం విజయవాడలోని సచివాలయం చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం అనంతరం నారా లోకేష్‌ని కలిశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో మంత్రి నారా లోకేష్ ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు టిడిపి సీనియర్ నాయకులు వున్నారు.

## జిల్లా బిఎస్పీ పార్టీ కన్వీనర్‌గా ధనంజయులు నియామకం

నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ) కన్వీనర్‌గా నారాయణవనం మండలం బ్రాహ్మణాతాంగేల్ గ్రామానికి చెందిన కె.ధనంజయులను రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ మంగళవారం ప్రకటించారు. ధనంజయులు మాట్లాడుతూ బహుజనుల పార్టీ బిఎస్పీ పార్టీ అభివృద్ధి కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షులుగా నియమించడం పట్ల రాష్ట్ర అధ్యక్షులుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బిఎస్ ్ప పార్టీ అభివృద్దికి మరింత కృషి చేస్తానన్నారు. ఆయనకు పదవిరావడం పట్ల పలువురు బిఎస్పీ నాయకులు, యువకులు అభినందనలు తెలిపారు.

## అంకుర్జార్పణతో ప్రారంభమైన పరాశారేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో టిటిడి అనుబంధ ఆలయంగా ప్రసిద్ది చెందిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాయంత్రం గణపతిపూజ, అంకురార్ప రణతో ప్రారంభమైనది. అంతకుముందు స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై అలంకరించి ఆల యం లోనే ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. సాయంత్రం గణపతిపూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం అంకురార్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

***నేడు ధ్వజారోహణం :*** నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి బుధవారం ఉదయం 6-7.30గంటలకు మిధునలగ్నంలో ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ పర్యవేక్షులు నాగరాజు తెలిపారు.

## వ్యవసాయ డిప్లొమా కోర్సు ప్రవేశాలకు గడువు పొడిగింపు

తిరుపతి విద్య జూన్ 24 ప్రభాత వార్త

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2025-26 విద్యాసంవత్సరానికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.వి. సుమతి తెలిపారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ లో ప్రవేశాలు పొందేందుకు మేలో విశ్వవిద్యాలయం ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ నెల 16తో ప్రవేశాల గడువు ముగిసిందని,విద్యార్థుల సౌకర్యార్థం నెలాఖరు వరకు గడువు పెంచినట్లు వివరించారు. అగ్రికల్చర్,ఆర్గానిక్,సీడ్ టెక్నాలజీ,అగ్రి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని, పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు.



## యస్వీయూలో జాబ్‌మేళాపై బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జూన్ 24 ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ జూలై నెల 6 వ తేదీ ఎం.ఆర్. ఎఫ్.సంస్థ నిర్వహించబోతున్న ఉద్యోగ మేళా బ్రోచర్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అప్పారావు,రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు,డైరెక్టర్ ఆచార్య మురళీధర్,కో ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ ఆవిష్కరించారు. యస్వీయూలో నిర్వహిస్తున్న జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికేనని వారు చెప్పారు. డిప్లొమా,ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు అందరూ ఈ ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని, కేవలం అబ్బాయిలే అర్హులని ఎ.ఆర్.ఎఫ్ . ప్రతినిధి ఆర్. వెంకటరామన్ తెలిపారు. ఏ విద్యార్థి అయినా ప్రతిభ చూపి ఉద్యోగం పొందే అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించు కోవచ్చని,ఉపాధిని పొందాలని విశ్వవిద్యాలయ అధికారులు అన్నారు.



## శివయ్య సేవలో తెలంగాణ బిజెపి కార్యదర్శి

శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యదర్శి,పఠాన్ చెరువు మాజీ ఎంఎల్ఏ నందీశ్వర్‌గౌడ్ కుటుంబసమేతంగా పాల్గొన్నారు. వారికి రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ సారధ్యంలోఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటుచేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేద పండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. స్వాగతం పలికిన వారిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త దామెర్ల

## ఓటేరు కాల్వలో రబ్బిష్‌ను తొలగించిన అధికారులు

శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి కమిషనర్ సంజీవరావు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఓ వైపు స్వీపింగ్ మరో వైపు ప్రధాన కాలువ అయిన ఓటేరు కాల్వలో గుట్టగుట్టలు గా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించుటకు చర్యలు తీసుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మురుగునీటి కాలువల్లోని మురుగు నీరు 75శాతం ఓటేరు కాల్వ ద్వారా చెంబేడు కాలువలో కలస్తుంది. అయితే ఈ కాలువలో డస్ట్ పేరుకు పోవటంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. అంతేకాక ఈ కాలువ వెంబడి దుర్గంధ భరితంగా మారింది. రోగాలకు నిలయంగా మారింది. శాసనసభ్యుడుగా బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గెలిచిన




తరువాత మున్సిపల్ మంత్రితో చర్చించి రూ.60 లక్షలు ప్రత్యేక నిధులు సాధించి పరిశుభ్రం చేయించారు. సిల్టు తొలగించారు. దాంతో మురుగు నీరు సఫాయిగా సాగుతుంది. అయితే పట్టణంలో వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోయాయి. ఈ సమస్యను గుర్తించి ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి కమిషనర్ సంజీవరావు శానిటరి ఇన్స్పెక్టర్లు బాలసుబ్రమణ్యం, మోతీలాల్‌లతో సమీక్షించారు.

మున్సిపల్ సిబ్బందితోనే కాలువలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించుటకు కార్మికులను దించారు. సుమారు ఓ ఫర్లాంగు కాలువలో రెండు ట్రక్కుల రబ్బిష్ బయట పడింది. మున్సిపల్ అధికారుల చొరవను ప్రజలు హర్షించారు.

**CHANGE OF NAME**

I, **POTTEPALEM PRASUNAMMA,** (Old Name) W/o. POTLAPUDI RAGHURAMAIAH, R/at D No: Beside SBI, TP Gudur BIT-1, TP Gudur, SPSR Nellore Dist, AP. I have changed my name to POTLAPUDI SRAVANI. Henceforth I will be known as **POTLAPUDI SRAVANI** (New Name )

# అగర్వాల్‌ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి : సిఐటియు

పెళ్లకూరు, జూన్ 24 ప్రభాతవార్త : మండల రెవెన్యూకార్యాలయం నందు మంగళవారం సిఐటియు వారు ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రమాదాలపై డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది పెన్నేపల్లి గ్రామంలో ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమలో గత కొన్ని నెలలుగా నిరంతరం జరుగుతున్న ప్రమాదాలు వల్ల ఇప్పటికి ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం జరిగినది, ప్రమాదంలో మరణించిన వారందరూ బీహార్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు సంబంధించిన వారు కావడంతో వారికి సంబంధించిన పూర్తి సమాచారం కంపెనీ యాజమాన్యం తెలియజేయడం లేదన్నారు. మంగళవారం ఉదయం బాయిలర్ దగ్గర జరిగిన ప్రమాదంలో ఝార్ఖండ్‌కు చెందిన దూలారి యాదవ్ ( 47) ఇతనుకు 80 శరీరం కాలిపోవడం జరిగినది, పాట్నా కు చెందిన నిఖిలేష్ కుమార్ 30 శరీరం కాలిపోయినట్లు సమాచారం, వీరిని చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించినట్లు పరిశ్రమ ఉద్యోగస్తులు తెలియజేశారు. అంతేకాకుండా ఈ తరచూ జరుగుతున్న ప్రమాదాల వలన చుట్టుపక్కల ఉన్న సుమారు నాలుగైదు గ్రామాల ప్రజలతో పాటు ఈ కంపెనీలో పనిచేస్తున్న స్థానికులుభ య భ్రాంతులకు గురి అవుతున్నారన్నారు.

ఈ కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం వలన ఈ ప్రాంతంలో క్యాన్సర్ వ్యాధులు ఎక్కువ వుతున్నాయి, పంటలు, పంట పొలాలు నాశనం అవుతున్నాయి, పై అంశాలు పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం, ఈ పరిశ్రమను స్వాధీన పరచుకొని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించాలని,అంతేకాకుండా కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇచ్చి పనిచేయించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్మికుల భద్రత విషయంలో సిఐటియు అనేక పర్యాయాలు కంపెనీ యాజ మాన్యంకు విజ్ఞప్తి చేసినప్పటికీ వాళ్లు పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మండల నాయకులు శివకవి ముకుంద ముత్యాలయ్య అబ్దుల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

## ఆధార్ నవీకరణకు శ్రీకారం

కోట, జూన్ 24 ప్రభాతవార్త : ఆధార్ భారత విశిష్ట గుర్తింపు సంఖ్య అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి అందరికీ అవసరంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల్లో రాయితీల లబ్ధి పొందాలంటే సేవల కోసం ఆధార్ తప్పనిసరి చేశారు. పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో ప్రవేశాలకు వెళ్లినప్పుడు ఆధార్ అడుగుతున్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు సైతం ఆధార్ జారీ చేస్తున్నా, వారి తల్లిదండ్రుల వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. ఐదేళ్ల వయస్సు నిండిన అనంతరం ఆధార్ నవీకరణ చేసుకోవాల్సి ఉన్నా అధికశాతం మంది చేసుకోవడం లేదు. ఇలాంటి వారి సమాచారాన్ని యుఐడిఏఐ సేకరించింది. వెంటనే అప్‌డేట్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం కోట పంచాయతీలోని ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ ప్రారంభించారు.

## గూడలి కొండ అందాలు ఎంతో అద్భుతం



కోట, జూన్ 24 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో రాష్ట్రస్థాయి ఎన్‌సిసి క్యాంప్ జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం క్యాంప్‌కు విచ్చేసిన ఎన్‌సిసి క్యాడెట్లు గూడలి కొండపై ప్రకృతి అందాలను తిలకించారు. కొండ పక్కనే స్వర్ణముఖి నది, వరి చేలు, అక్కడ ఉన్న సుందరమైన రమణీయమైన దృశ్యాలను అద్భుతంగా ఉన్నాయని ఎన్‌సిసి కమాండర్ గణేష్ అన్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించి పరిసరాలు గొప్ప అనుభూతినిచ్చాయని చెప్పారు. అనంతరం అగ్ని ప్రమాద నివారణపై విద్యార్థులకు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు మల్లికార్జునరెడ్డి, ఎన్.ఓ. పెంచలయ్య, ప్రసాద్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అగ్నిమాపక అధికారి జ్ఞాపికను అందజేశారు.

## త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులు జారీ

**- సివిల్ సప్లై డిటి నరేష్**



బాలాయపల్లి, జూన్ 24 ప్రభాతవార్త : త్వరలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అందజేయనున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ నరేష్ తెలిపారు. బాలాయపల్లి ప్రీతి కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 30లోపు దివ్యాంగులకు వృద్ధులకు ఇంటి వద్దకు తీసుకెళ్లి సరుకులు ఇవ్వాలని తెలిపారు. కొంతమంది డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్లు నుండి బియ్యం తక్కువ వస్తున్నాయని కొంతమంది డీలర్లు ఎమ్మార్వో విజయలక్ష్మి దృష్టికి డిటీ తీసుకెళ్లారు. ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్చార్జ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని తహశీల్దార్ తెలిపారు. మండలంలో 1397 మంది ఈకేవైసీ చేసుకున్నారని మిగిలిన వారు నేను అలా చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులను చేర్పించండి



బాలాయపల్లి, జూన్ 24 ప్రభాతవార్త : సాంఘిక బాలికల ఎస్సి సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులను చేర్పించాలని పలు గ్రామాలలో కరపత్రాలు పంపకాల ప్రచారం చేపట్టిన మేట్రిన్ చెంచు రత్నమ్మ, హాస్టల్ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చేరేందుకు 3 నుండి 10వ తరగతి బాలికలకు 2025-2026 విద్యా సంవత్సరంకు అడ్మిషన్స్ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. తెల్ల రేషన్ కార్డు గల ఎస్సి, ఎస్టీ, బీసీ, ఓసీ తల్లిదండ్రుల పిల్లలు అర్హులు అని వివరించారు. జులై 15 వ తేదీలోగా అర్హత, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## జులై 5నలోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



గూడూరు, జూన్ 24 ప్రభాతవార్త: గూడూరు రెండవ పట్టణంలోని కోర్టులో 7వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి కె.వెంకట నాగ పవన్ అధ్యక్షతన జులై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 7వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి కె.వెంకట నాగ పవన్ మాట్లాడుతూ జులై 5వ తేదీన గూడూరు కోర్టు ప్రాంగణంలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ. సులోచన రాణి, బార్ సెక్రెటరీ ఎంవి. కృష్ణయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఏ.కోటేశ్వర రావు, ప్యానల్ అడ్వకేట్ మహబూబ్ బాషా, లోక్ అదాలత్ మెంబర్ జానా సురేష్, సీనియర్ అడ్వకేట్ ఏ. రజనీకాంత్ రెడ్డి, గూడూరు అర్బన్ సిఐ శేఖర్ బాబు, రూరల్, చిల్లకూరు, మనుబోలు, సైదాపురం ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ సేవలు పునరుద్ధరణ



వాకాడు, జూన్ 24 ప్రభాతవార్త : వాకాడు 2 సచివాలయాన్ని మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాకాడు మండలంలో ఎన్నో నెలలుగా నిలిచిపోయి ఉన్న ఆధార్ సర్వీసులను పునరుద్ధరించారని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వాకాడు2, నెల్లిపూడి సచివాలయాల్లో అందుబాటులో ఈ ఆధార్ సర్వీస్‌లో ఉన్నాయని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మోనిక మరియు జితేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యార్థం స్పందించిన ఎమ్మెల్యే



చిట్టమూరు, జూన్ 24 ప్రభాతవార్త: మండలంలోని మెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించే పేద విద్యార్థుల సౌకర్యార్థం గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ స్పందించి ఆర్టీసీను పునరుద్ధరించారు. మెట్టు నుంచి కొండాపురం, జంగాలపల్లి,తిమ్మారెడ్డివాగు వరకు వెళ్లే స్కూల్ బస్సును విద్యార్థుల కోసం పెళ్లకూరు, గుణపాడు, మెట్టు వరకు పొడిగించి ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థుల కోసం పాటుపడే వ్యక్తిగా మరో మారు ఎమ్మెల్యే ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చొరవ చూపడంపై మండల పార్టీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.

## తిన్నెలపూడిలో పొలం పిలుస్తోంది

కోట, జూన్ 24 ప్రభాతవార్త : మండలం తిన్నెలపూడి, వెంకన్నపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు పొందాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. యూరియా, రసాయన ఎరువులు వాడకుండా శనగపిండి, బెల్లం, ఆవు మూత్రం వంటివి వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ మోడల్ మేకర్ శ్రీనివాసులు, శివకుమారి, లీడ్ ఫార్మర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారం నందు పొలం పిలుస్తోంది




దొరవారిసత్రం,జూన్ 24 ప్రభాతవార్త: పిఎమ్‌డిఎస్ కిట్స్ 12 రకాల విత్తనాలతో దొరవారిసత్రం మరియు నెలబల్లి నందు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. 10కెజి కిట్ రూ.650కి ఇస్తున్నామని తెలిపారు.వరి పంట నందు ఆకుముడతకు ఇండాక్సాకార్బ్ కాండం తొలుచు పురుగుకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ వాడాలని సూచించారు. సూరపు అగ్రహారం నందు ఉన్న పిఎమ్‌డిఎస్ 20 రకాల విత్తనాల్ని వేసిన పొలమును సందర్శించారు.అన్నదాత సుఖీభవ లబ్ధి పొందుటకు ఎవరు ఈకెవైసీ చేసుకోవాల్సిన అవసరం లేదు అని తెలిపారు. కొంతమంది లిస్ట్‌లో పేరు రాలేదు అని అడుగుతున్నారు. అలాంటి వారు ముందుగా మీ భూమికి ఆధార్‌కి లింక్ చెక్ చేసుకుని వ్యవసాయశాఖ వారికి అర్జీ ఇస్తే అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు గ్రీవెన్స్ మాడ్యూల్ వదిలిన వెంటనే వారి అర్జీని పంపించి తగిన పరిష్కారం చేయగలమని తెలిపారు.

## మాజీ సర్పంచ్ ప్రభావతమ్మకు సన్మానం



నాయుడుపేట రూరల్, జూన్ 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూరైన సందర్భంగా తిరుపతి జిల్లా నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ,పార్టీ యువ నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అవధానం సుధీర్‌నీ మాజీ సర్పంచ్ ప్రభావతమ్మ నివాసంలో మంగళవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత నేత మాజీ టిడిపి సీనియర్ నాయకులు గూడూరు రఘునాథరెడ్డి, మల్లెమాల రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు పేల్లకూరు మండలంలో తెలుగుదేశం పార్టీకి అండగా ఉండడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ యొక్క కూటమి నేతల ఏకమై మళ్లీ తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలని వారు సూచించారు. పెళ్లకూరు మండల పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య,స్వర్ణముఖి ఆయకట్ట చైర్మన్ ప్రసాద నాయుడు, పునబాక పోలయ్య, వెంకటేశ్వర్లు,నెలవల ప్రసాద్,సిద్ధల నాయుడు, రాము, పరశురాం, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిసి హాస్టల్ సంఘటనపై అధికారులు నాయకులు పరుగో పరుగు

శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని పానగల్ బిసి హాస్టల్‌లో మంగళవారం అల్పా హారం తీసుకున్న 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కావటంతో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌డిఓ, పోలీసు అదికారులతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆసుపత్రికి, హాస్టల్‌కు పరుగులు తీసారు. అయితే ఈ సంఘటనలో అధికారులతో అస్వస్థతకు గురైన విద్యార్థులు ఎవ్వరికి ఏమి కాలేదని తెలియటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సమాచారం అందిన వెంటనే శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చరవాణి ద్వారా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.మణితో చర్చించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.వెంటనే తమ పార్టీ నాయకులను అప్రమత్తం చేసారు. తొట్టంబేడు మండల తెలుగుదేశం నాయకుడు రావిళ్ళ మునిరాజా నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు,రెడ్డివారి గురువారెడ్డి, ఉమేష్, దశరథాచ్చారి, పేట బాలాజి, మిన్నల్ రవి, పార్టీకి చెందిన ప్రముఖులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. అలాగే ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, సిఐ నాగార్జున్‌రెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమ బిసి భరత్‌కుమార్ రెడ్డి, డివిజన్ అధికారి మునీంద్రయ్యలు పరుగులు తీసారు.



**వీడియో కాన్ఫరెన్సులో సుధీర్‌రెడ్డి:**

శ్రీకాళహస్తి బిసి హాస్టల్ సంఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి ప్రతి అర గంటకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మణితో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. త రువాత మీడియాతో మాట్లాడుతూ బిసి హాస్టల్‌లో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వివరించారు. వారిలో ఒక విద్యార్థికి మాత్రం తీవ్ర లక్షణాలు చూపించగా మిగిలిన 15 మంది ఆరోగ్యం గానే ఉన్నట్లు ఎంఎల్ఏ వివరించారు.ఆ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డాక్టర్లు అవసరమైన వైద్య సహాయాన్ని అందించాలని సూచించారు.విద్యార్థులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. తాను స్వయంగా హాస్టల్‌లో బోజన నాణ్యత, వసతులపై తనిఖీ చేస్తామని ఈ సంఘటనకు సంబంధించి రాష్ట్ర మంత్రుల దృష్టికి తెచ్చినట్లు వివరించారు.కాగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ సంఘటనపై స్పందించారు. ఆసుపత్రి వద్దకు చేరుకొని విచారించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తలపా దామోదర్‌రెడ్డి, సిపిఐ నాయకుడు జనమాల గురవయ్య, ఏఐవైయఫ్ రాష్ట్ర కార్యదర్శి కత్తిరవి, పిడిఎఫ్‌యు జిల్లా కార్యదర్శి జాకిర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మునిచందు విద్యార్థులను పరామర్శించారు.

## తారక్‌నాథ్ సేవలు అనిర్వచనీయం



శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి హోమియో ఆసుపత్రిలో ఏడు సంవత్సరాల పాటు తన సేవలను అందించిన టి.తారక్‌నాథ్ ఎంత పొగిడినా తక్కువే అని పలువురు అన్నారు. శ్రీకాళహస్తి ప్రజలకు ఏడు సంవత్సరాల పాటు సేవలందించిన తారక్‌నాథ్ మంగళవారం శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది ఉద్యోగ విరమణ సన్మానం చేశారు. ఆయుష్ శాఖలో ప్రభుత్వ హోమియోపతి వైద్య శాలలో 1984 సంవత్సరం నుండి ఉద్యోగంలో చేరి చిత్తూరు, తిరుపతి జిల్లాలో మదనపల్లి, పలమనేరు, చిత్తూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, మంగళం తదితర ప్రాంతాల్లో సుమారు 42 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. వక్తలు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో హోమియో వైద్యానికి గుర్తింపు తెచ్చారని వివరించారు. ఈ సందర్భంగా తారక్‌నాథ్ మాట్లాడుతూ మానవసేయే మాధవ సేవన అని, శ్రీకాళహస్తిలో పనిచేసిన రోజులు జీవితంలో గుర్తుండి పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి హోమియో వైద్యులు డాక్టర్ లావణ్య, విశ్రాంత పిహెచ్ఓ జి.రామారావు, ప్రజానాట్యమండలి చారులత, సిపిఐ నాయకుడు గురవయ్య, గోపి,మునిచందు, భారతి,కోలా ప్రేమ,ఆశావర్కర్లు,నర్సులు,శానిటరి సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ శాఖల మంత్రులతో ఎమ్మెల్యే భేటీ

పుత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త : విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వివిధ శాఖల మంత్రులతో భేటీ అయ్యారు. నగరి నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని విద్యుత్ అవసరాలకు అవసరమైన సబ్ స్టేషన్లను మంజూరు చేయాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. దేవాదాయ శాఖ మంత్రిని కలిసి వడమాలపేట మండలంలోని సదాశివకోన అభివృద్ధికి నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విజయపురం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని చిన్నతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు.

## కూల్ బీచ్ మామిడి పరిశ్రమలో అవినీతి బట్టబయలు

పూతలపట్టు, జూన్ 24 ప్రభాతవార్త : పూతలపట్టు మండలం పి.కొత్తకోట కూల్ బీచ్ మామిడి పరిశ్రమ నందు అవినీతి బయటపడినది. ఆ కంపెనీ యాజమాన్యం స్థానిక రైతుల నుంచి మామిడి కాయలు ను కొనుగోలు చేయకుండా బయటి మామిడి పరిశ్రమ వాళ్లతో కలిసి సిండికేట్ రాజకీయాలను ప్రదర్శిస్తూ మామిడికాయల తూకలలో అవతవకలు చోటు చేసుకున్నది. స్థానిక రైతులకు తీసుకుని వచ్చే మామిడికాయల బరువులలో 1000 కేజీలకు 100 కేజీలు తక్కువ చూపెట్టడం అసలే గిట్టుబాటు ధర లేక రైతన్నల గోడు వర్ణాతీతముగా ఉన్నది దీనికి తోడు ఈ ప్రైవేటు యాజమాన్యాలు సిండికేట్గా ఏర్పడి కూల్ బీచ్ కంపెనీలో రైతులను నిట్టనిలువుగా ముంచేసే ప్రయత్నాలు చేయడం చాలా దారుణమని అన్నారు.

# గూడూరు డివిజన్

## వేధింపులపై కేసు నమోదు

కోట, జూన్ 24 ప్రభాతవార్త : మండలం చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన రజనీ తనను భర్త దిలీప్ నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నాడని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు. 15 సంవత్సరాల క్రితం దిలీప్‌తో రజనీకి వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే దిలీప్ చెడు వ్యసనాలతో పాటు భార్యపై అనుమానంతో వేధించేవాడు. అంతేకాకుండా నిరంతరం తనను కొట్టేవాడని ఫిర్యాదులో బాధితులు పేర్కొంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

## ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

బాలాయపల్లి, జూన్ 24, ప్రభాతవార్త మండలంలోని సచివాలయాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. మండలంలోని నిండలి సచివాల యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆధార్ కార్డు లేని వారు వెంటనే చేసుకోవాలని సూచించారు. చిన్నారులందరికీ ఆధార్ కార్డు చేయించాలని తెలిపారు.

## బాల కార్మికుల చేత పనులు చేయించుకుంటే చర్యలు

**- కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ సురేష్ కుమార్**



వెంకటగిరి, జూన్ 24 ప్రభాతవార్త : బాలల చేత పనులు చేయిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ సురేష్ కుమార్ హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని మెకానిక్ షాపులు, దుకాణాల్లో కార్మిక శాఖ అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థ వారు సంయుక్తంగా తనిఖీలు చేశారు. 18 సంవత్సరాల లోపల ఉన్న వారి చేత పనులు చేయించరాదని సూచించారు. బాల కార్మికులు ఉంటే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. మెకానిక్ షాప్‌లో బాలుడు పనులు చేయిస్తున్నారని అతని తిరిగి కాలేజీకి పంపుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదివే పిల్లలైతే తిరిగి మరల పాఠశాలలకు పంపుతామని తెలిపారు. పిల్లలు చాలా పనులు చేయించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో రాపూరు కార్మిక శాఖ అధికారి వై సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## మద్యం సేవించి నడిపే డ్రైవర్లపై చర్యలు : సీఐ



వెంకటగిరి, జూన్ 24 ప్రభాతవార్త : మద్యం సేవించి వాహనాలు నడిపే డ్రైవర్ల పై చర్యలు తీసుకుంటామని సీఐ ఏవి రమణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆటోలు, కార్ల డ్రైవర్లతో ఎస్ఐ ఏడుకొండలుతో కలిసి సిఐ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సూచన మేరకు డ్రైవర్తో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. డ్రైవర్లు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాన్ని నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల వారు అధికంగా ప్రయాణికులు లెక్కించుకొని నడప రాదని సూచించారు. డ్రైవర్లకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

వెంకటగిరి, జూన్ 24 ప్రభాతవార్త : ఈనెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు పట్టణంలోని పలు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. 24,వ తేదీ ఎన్టీఆర్ కాలనీ, ఎన్జీవో కాలనీ, 26వ తేదీ బంగారు పేట, 27వ తేదీ రాణి పేట సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నారులకు ఆధార్ చేయించాలని కోరారు.

## పోలీసులకు లొంగిపోయిన యువకుడు

చిల్లకూరు, జూన్ 24 ప్రభాతవార్త : చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం ఉదయం చిల్లకూరు గ్రామానికి చెందిన అచ్చి ప్రవీణ్ అనే యువకుడిని అతి దారుణంగా మరణాయిదాలతో హత్య చేసాడు. ఈ హత్యకు పాల్పడిన బండి సుబ్రహ్మణ్యం పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబుతో పాటు తాసిల్దార్ కే శ్రీనివాసులు, విఆర్ఓ గిద్దలూరు రవణమయ్య సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి పలు విషయాలు సేకరిస్తున్నారు. పాతకక్షలే హత్యకు కారణమని అనుమానం వ్యక్తం చేస్తున్నారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మండల పార్టీ అధ్యక్షుడు దువ్వూరుకి ఘన సన్మానం



చిల్లకూరు, జూన్ 24 ప్రభాతవార్త: మండలంలోని తిక్కవరం గ్రామ పంచాయతీలో ఉన్న చిన్న కట్టపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన చిల్లకూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజశేఖర్‌రెడ్డిని ఘనంగా శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఓడూరు సత్యనారాయణరెడ్డి, లింగారెడ్డి, మేఘనూరు కృష్ణయ్య, మూగశంకరయ్య, సతీష్ మేకల కుమారు ఆవుల ప్రభాకర్, ఓబ్బాయి శివకుమార్, చెరుకూరి పద్మజ, నాగేశ్వర రావు నాయుడు, పచ్చ వెంకటేష్ నాయుడు, చిట్టేటి శ్రీనివాసులు, పూడి పర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, అన్న మునిశేఖర్, పుల్లూరు ప్రకాశం శెట్టి, మరి కొంతమంది తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత మత్తుపదార్ధాలకు దూరంగా ఉండాలి : సిఐ



నాయుడుపేట, జూన్ 24 ప్రభాతవార్త : సమాజంలో యువత మత్తుపదార్ధాలకు దూరంగా ఉండాలని నాయుడుపేట సిఐ బాబి తెలియజేశారు. డిఎస్‌పి చెంచు బాబు ఆదేశాల మెరకు పట్టణంలోని ఎన్ ఎస్ఆర్ కాలనిలో సిఐ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు కార్డేన్‌చర్చ్ నిర్వహించారు. నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో వాహనాలు తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా సిఐ మాట్లడుతూ యవత గంజాయి, మద్యం వంటి మత్తుపదార్ధాలకు దూరంగా ఉండాలని సూచించారు. కాలనిల్లో ఎవరైన కొత్తవ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే తమకు సమాచారం తెలియ జేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎస్సై ఆదిలక్ష్మి, శ్రీకాంత్, బ్రహ్మనాయుడు, పోలీసులు లు పాల్గొన్నారు.

## టెక్నికల్ అసిస్టెంట్, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్

రేణిగుంట, జూన్ 24 ప్రభాతవార్త : మండలంలో ఉపాధి హామీ పనులలో అవినీతి జరగలేదని, కొంతమంది నిర్లక్ష్యం వహించారని మంగళవారం డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్ ఓ టెక్నికల్ అసిస్టెంట్ ను మరో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. రేణిగుంట మండలం 19వ రౌండ్ సోషల్ ఆడిట్ సంబంధించి నిర్ణయాధికారిగా తిరుపతి డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారులు, ఉపాధి హామీ శ్రామికులతో నిజ నిర్ధారణ ప్రజా వేదిక నిర్వహించారు. నిధులు వినియోగంలో అవినీతి జరగలేదని పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్ల 2,14,000 రూపాయల పెనాల్టీతోపాటు 1, 37,500 రూపాయలు రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు గత సంవత్సరం 9,75,000 రూపాయలు కూలీలకు పేమెంట్ చేసామన్నారు. తుకివాకం చెరువుకు సంబంధించి ప్రస్తావనకు రాగా చెరువును బ్యూటీఫికేషన్ చేస్తామన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని దినాలు తగ్గకుండా చర్యలు చేపడతామన్నారు.

